క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: కిలో.. రూపాయల్లో... టమాటా 23, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 23, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 38, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 15, క్యారెట్ 37, దొండ 28, గుండు బీన్స్ 50, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 20, దోసకాయ 28, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 35, కందగడ్డ 40, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఓయూలో రేపు బీసీ సీఎం సాధన సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో శనివారం (26న) బీసీ ముఖ్యమంత్రి సాధన సదస్సును నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ సీఎం సాధన సమితి చైర్మన్ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం గద్దరన్న యాదిలో తెలంగాణలో సామాజిక న్యాయం, బీసీ సీఎం సాధన సదస్సు వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు జరిగే సదస్సుకు అందరూ ఆహ్వానితులే అన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి



మారేడ్‌పల్లి ఎమ్మార్వో పద్మ సుందరిని కలిసిన బీజేపీ నేతలు

అడ్డగుట్ట: మండల పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి రక్షించాలని బీజేపీ నాయకులు ఎమ్మార్వోను కోరారు. మారేడ్‌పల్లి మండల తహశీల్దార్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన పద్మ సుందరిని అడ్డగుట్ట డివిజన్ బీజేపీ నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం, వాళ్లు మాట్లాడుతూ మండల పరిధిలో ప్రభుత్వ భూములను కబ్జాకోరల నుంచి కాపాడాలని కోరారు. బీజేపీ అసెంబ్లీ ఓబీసీ కన్వీనర్ రాజుగౌడ్, జిల్లా ఎస్సీ మోర్చ అధికార ప్రతినిధి హంసరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే కంటోన్మెంట్ అభివృద్ధి



అన్నానగర్‌లో పాదయాత్ర చేస్తున్న జీవకన్

రసూల్‌పురా: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ఆర్ హయంలోనే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవకన్ పేర్కొన్నారు. గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గం అన్నానగర్‌లో జీవకన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పాదయాత్ర నిర్వహించారు. కంటోన్మెంట్‌కు కృష్ణా జలాలు, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ప్యాట్నీ నాలా అభివృద్ధికి నిధులు తదితర అభివృద్ధి పనులు జరిగాయని అన్నారు. ఈ సారి కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళి, బాల్‌రాజు, ప్రతాప్, ముఖేష్, మహేష్ యాదవ్, మైఖల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా పోచయ్య యాదవ్



లాలాపేట: భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు పోచయ్య యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పలువురిని పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబర్లుగా నియమించారు. ఇందులో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోచయ్య నియమిలయ్యారు. నియామక ఉత్తర్వులను బీజేపీ ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి విడుదల చేశారు.

కల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు.

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. వేడుకలను ఉదయం 5 గంటలకు ఆలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావు ప్రారంభించారు. వేదపండితుల నేతృత్వంలో శ్రీవారికి అభిషేకం, సహస్ర కళషాభిషేకం, ధ్వజస్తంభ ప్రత్యేకపూజలు తదితర కైంకర్యాలు నిర్వహించారు. సీతాఫల్‌మండితోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

మంత్రి తలసాని



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని, లాస్య నందిత

రసూల్‌పురా: రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం లీ ప్యాలెస్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత ఆధ్వర్యంలో బీసీ బంధు పథకం ద్వారా మంజూరైన చెక్కులను గురువారం మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రక్షణ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని కంటోన్మెంట్‌లోని ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేసిందని అన్నారు. మొదటి విడతలో 300 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి మూడు కోట్ల రూపాయలను అందజేస్తున్నామని మిగిలిన వారికి విడతల వారీగా అందజేస్తామని మంత్రి హామీచ్చారు.

లాస్య నందితను ఆశీర్వదించండి..

దివంగత ఎమ్మెల్యే కుమార్తె లాస్య నందితను కంటోన్మెంట్ ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి ఆశీర్వదించాలని మంత్రి తలసాని కోరారు. గతంలో సాయన్నకు ఏ విధంగా అండగా ఉన్నారో అదేవిధంగా లాస్యకు మద్దతుగా నిలవాలని అన్నారు. రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జేల నాగేష్, బీసీ సంక్షేమాధికారి ఆశన్న, సికింద్రాబాద్ ఆర్డీవో రవీందర్ దితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి



అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర రోనాల్డ్ రాస్

సికింద్రాబాద్: పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయడం కోసం ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం వార్డుస్థాయిలో ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలోని ఫంక్షన్‌హాళ్లు, వంతెనల నిర్మాణం పనులు, పారిశుద్ధ్యం పనుల తీరుతెన్నులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం జోనల్ కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ కమిషనర్లు, వైద్యవిభాగం, శానిటరీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం పనుల నిమిత్తం వార్డు స్థాయిలో మొదలవుతున్న ప్రాథమిక పనుల నుంచి డంప్ యార్డుకు తరలించే వరకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో ప్రణాళికలో పేర్కొనాలన్నారు. చెత్త సుకరణ ఒక్కటే కాకుండా భవన నిర్మాణ వ్యర్థాలు, స్వీపింగ్, లిఫ్టింగ్, ట్రాన్స్‌పోర్టు, తదితర వివరాలు నివేదించాలన్నారు. కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ శానిటేషన్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మినిష్టర్‌రోడ్డులోని నిర్మాణం పూర్తయిన వంతెనలు, బన్సీలాల్‌పేట్‌లోని మెట్లబావి తదితర ప్రాంతాలను కమిషనర్ రోనాల్డ్ రాస్ సందర్శించారు.

కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలపై కదలిక

కంటోన్మెంట్: ఎట్టకేలకు కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలపై కదలిక మొదలైంది. ఉద్యోగ సంఘం సమ్మె నోటీసుతో కార్మిక శాఖ అధికారుల ఆదేశాలకు కంటోన్మెంట్ బోర్డు తప్పనిసరి పరిస్థితుల్లో తమ వైఖరి వెల్లడించింది. ఉద్యోగులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం రక్షణ శాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఉందని, జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్ విలీనంపై జనవరిలో జరిగిన సమావేశం మినహా ఎలాంటి కదలిక లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు కంటోన్మెంట్ బోర్డు అధికారులు కేంద్ర కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు లేఖ రాశారు.

29 మందికి లైన్ క్లియర్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో దాదాపు పదిహేనేళ్లుగా కారుణ్య నియామకాలు చేపట్టలేదు. దీంతో కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్న వారి సంఖ్య 102కు చేరింది. అయితే బోర్డు నిబంధనల మేరకు మొత్తం ఖాళీల్లో గరిష్టంగా 5 శాతం మందికి మాత్రమే ఉద్యోగం కల్పించే అవకాశం ఉంది. అయితే పదిహేనేళ్లగా ఒక్కరికి కూడా కొత్తగా రిక్రూట్ చేయలేదు. దీంతో కొన్నేళ్లుగా ఉద్యోగులు ఆందోళన చేపడుతున్నారు. తాజాగా సమ్మె నోటీసులో ఇదే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో బోర్డు అధికారులు ఉద్యోగ సంఘం నేతలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీఈఓ (ఇంచార్జ్) భూపతి రోహిత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు తాజా లెక్కల ప్రకారం 29 మందికి తక్షణమే ఉద్యోగం కల్పించే వీలుందని ఉద్యోగ సంఘం నేతలు తెలిపారు. మిగతా వారికి సంబంధించి ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకున్నాక నియామకాలు చేపడతామన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు బీజేపీ ధర్నా



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: డబుల్‌బెడ్ గృహాల నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అందిస్తామన్న హామీతో గద్దెను ఎక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని సికింద్రాబాద్ జిల్లా బీజేపీ నాయకులు విమర్శించారు. ఇందుకు నిరసనగా బీజేపీ నాయకులు గురువారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎమ్మెల్యే పద్మారావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ 10 వేల డబుల్‌బెడ్ గృహాలను నిర్మిస్తామని చెప్పిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఐదు వందలు కూడా నిర్మించలేదన్నారు. దూద్‌బావి, లాలాపేట ప్రాంతాల్లో నిర్మించిన గృహాలను కూడా అబ్దిదారులకు అందించడంలో తాత్సారం చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం



సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు పొరుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ అన్నారు. గురువారం సీతాఫల్ మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం సహాయనిధికి చెందిన రూ. 45 లక్షల విలువచేసే చెక్కులను 44 మంది లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలను సికింద్రాబాద్ నియోజకవర్గంలో అర్హులైన అబ్దిదారులందరికీ అందించామన్నారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న బిషప్ , క్రిస్టియన్ సోదరులు

అమీర్‌పేట: తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డి.రాజేశ్వర్‌రావును క్రిస్టియన్ మత పెద్దలు సన్మానించారు. గురువారం బాధ్యతలు చేపట్టిన ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం, సంతోషదాయకమని అభిప్రాయపడ్డారు. సీఎస్ఐ మెదక్ బిషప్ కె.పద్మారావు, మినిస్టీరియల్ బోర్డు కన్వీనర్ యు.డానియేల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని దరఖాస్తు



కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేస్తున్న దీపక్‌జాన్



కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని కోరుతున్న గంటా సుధీర్

రాంగోపాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని కోరుతూ గురువారం ఆ పార్టీ సీనియర్ నాయకులు గంటా సుధీర్‌కుమార్ దరకాస్తు చేశారు. గంటా సుధీర్‌కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి గాంధీ భవన్‌లో అదిష్టానాన్ని కలిసి తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని కోరారు.


కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి..

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఆశిస్తూ పార్టీ సీనియర్ నాయకులు అడ్వకేట్ వినోద్ గాంధీభవన్‌లో గురువారం దరఖాస్తు చేశారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు పార్టీ సీనియర్ నాయకుడిగా తనకు టికెట్ కేటాయించాలని కోరినట్లు వినోద్‌కుమార్ రసూల్‌పురా లోని తన కార్యాలయంలో తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం దీపక్‌జాన్ దరఖాస్తు


సికింద్రాబాద్: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దీపక్‌జాన్ గురువారం దరఖాస్తు చేసుకున్నారు. సికింద్రాబాద్ నుంచి గాంధీ భవన్ వరకు ర్యాలీగా వెళ్లిన ఆయన తన దరఖాస్తును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవిదేశాల్లో అత్యుత్తమ డిగ్రీలు అందుకుని ప్రజాసేవ చేస్తున్న తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పీసీసీ నాయకులను కోరారు. ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు కిరణ్, బ్రహ్మాజీ, సునీల్, రాంలీలా, అరుణ్, లారెన్స్, గీత తదితరులు పాల్గొన్నారు.

జెక్‌కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరించిన జెక్‌కాలనీ ఫెడరేషన్ ప్రతినిధులు

సనత్‌నగర్: జెక్‌కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా తన సహకారం ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మరోసారి అధిష్టానం ప్రకటించిన దృష్ట్యా ఫెడరేషన్ ప్రతినిధులతో పాటు కాలనీ నివాసితులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెక్ కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి, నాగిరెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీహరి, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో డిప్యూటీ డీఈవో చిరంజీవి

విజేతలకు బహుమతుల ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ మోడల్ స్కూల్‌లో హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులు జరిగిన అంతర్ పాఠశాలల కబడ్డీ, ఖోఖో టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో డాక్టర్ చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందచేసి మాట్లాడారు.

చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలు

అమీర్‌పేట: చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా రాయల సేవా సమితి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం వద్ద గురువారం ఉదయం బాణా సంచ కాల్చి మిఠాయిలు పంచి పెట్టారు.అమ్మవారికి 108 కొబ్బరి కాయలు కొట్టారు. సంస్థ వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ వేదాలయ వార్షికోత్సవం

సికింద్రాబాద్: చిలకలగూడ కిందిబస్తీలోని శ్రీనల్లపోచమ్మ ఆలయ ఐదవ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. ఈ కార్యక్రమానికి ఆలయ నిర్మాత, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ రంగాల ప్రతినిధులు వెంకటసాయికుమార్, జలంధర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు రూపేశ్, రాము, శ్రీను, సందీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దళిత జీవితాల్లో వెలుగు

బన్సీలాల్‌పేట్: విద్యతోనే దళితుల జీవితాల్లో వెలుగు చూడగలమని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు అన్నారు. బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా పలువురు దళిత విద్యార్థులు ప్రైవేట్ స్కూల్‌లో అడ్మిషన్ లభించింది. బోయిగూడ సెయింట్ ఫిలోమినా స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎస్సీ అభివృద్ధి శాఖ అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకం దళిత విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోడానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీఆర్పీ నాయకులు మహేందర్, ఉదయ్‌కుమార్, ఎల్లం కుమార్, ప్రవీణ్‌లతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీసీలకు 60 సీట్లు కేటాయించాలి



ఓయూలో నిరసన తెలుపుతున్న బీసీ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను సవరించి బీసీలకు 60 సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఓయూ క్యాంపస్ న్యాయకళాశాల ఎదుట గల డాక్టర్.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. తక్కువ జనాభ గల అగ్రకులాలకు ఎక్కు సీట్లు కేటాయించి ఎక్కువ జనాభ గల బీసీలకు కేవలం 23 సీట్లు కేటాయించడం అన్యాయమన్నారు. బీసీలలో 136 కులాలు ఉంటే కేవలం ఐదు కులాల వారికే ఇటిక్కెట్లు ఇచ్చారని, మహిళలకు కేటాయించిన 7 సీట్లలో ఒక్క బీసీ కూడ లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీను, బీసీ విద్యార్థి రాష్ట్ర కార్యదర్శి నామని రాజేష్ పాల్గొన్నారు.

'ఓయూ భూముల కబ్జాకు నకిలీ డాక్యుమెంట్లు'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ భూముల కబ్జాకు కొందరు దళారులు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించారని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్ ధ్వజమెత్తారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రనిధులు, భూకబ్జాదారులు కుమ్మక్కై ఓయూ చుట్టూ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఓయూ అధికారులు ప్రజాప్రతినిధులకు దూరంగా ఉండాలని వారికి సహకరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మాణికేశ్వర్‌నగర్ వాసుల కోసం ఓయూలో స్థలంలో నిర్మించతలపెట్టిన 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పనులు ఆపాలని లేని పక్షంలో కంటేనర్, ఇతర నిర్మాణ యంత్రాలను, సామగ్రిని ధ్వంసం చేస్తామన్నారు.

అతిథి అధ్యాపక ఉద్యోగాల భర్తీకి టీడీఎల్ఎఫ్ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్స్) ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం (టీడీఎల్ఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్ కుమార్ గురువారం డిమాండ్ చేశారు. పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ కాలేజీల్లో సరైన సంఖ్యలో అధ్యాపకులు లేనందున వారికి నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్య అందడం లేదన్నారు. ఈ విద్యా సంవత్సరానికి కొన్ని ఖాళీగాలను భర్తీ చేయాగ ఇంకా 686 పోస్టులు మిగిలి ఉన్నాయని వివరించారు. ఖాళీల భర్తీకి ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసినా రాష్ట్ర ఉన్నత విద్య కమీషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీల భర్తీని వెంటనే చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

నాలాలో ఆడ శిశువు మృతదేహం లభ్యం

సనత్‌నగర్: నాలాలో ఆడ శిశువు మృతదేహం లభ్యమైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌ను ఆనుకుని ఉన్న బేగంపేట నాలాలో నలుపు రంగు బ్యాగ్‌లో అప్పుడే పుట్టిన పసికందు మృతదేహం ఉన్నట్లు స్క్రాప్‌ను సేకరించే ఓ వ్యక్తి హెచ్‌పీఎస్ సెక్యూరిటీకి తెలియజేశాడు. వారు స్కూల్ ఎస్టేట్ మేనేజర్ ప్రణీత్‌కు తెలియజేయగా అతను పోలీసులకు సమాచారం అందించాడు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు నాలాలో పడి ఉన్న బ్యాగ్‌ను సేకరించి చూడగా అందులో అప్పుడే పుట్టిన ఆడ శిశువు కనిపించింది. శిశువు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అయితే శిశువు మృతిపై పోలీసులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటో ఢీ కొని వ్యక్తికి గాయాలు



గాయపడ్డ సతీష్

లాలాపేట: లాలాపేట ప్రధాన రహదారిలో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ఆటో ఢీ కొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుదవారం లాలాపేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లాలాపేటకు చెందిన సతీష్(33) లాలాపేటలో లేబర్ అడ్డా వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టింది. దీంతో అతనికి గాయాలై రక్తం కారుతూ ఉండగా స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. దీంతో లాలాపేట ప్రధాన రహదారిలో కొంత సేపు ట్రాఫిక్ జాం ఏర్పడింది.

రైలుకింద పడి వ్యక్తిమృతి



మృతి చెందిన వెంకటాచారి

సికింద్రాబాద్: ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సమాచారం అందుకుని ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడి వద్ద లభించిన వివరాల ఆధారంగా మృతుడు బోడుప్పల్ హనుమాన్‌నగర్‌కు చెందిన పోలోజు వెంకటాచారి (70)గా గుర్తించారు. మృతికి గల కారణాలను పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు అభినందిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బడ్డెన్న

సికింద్రాబాద్: ఉత్తమ మార్కులు సాధించడంతోపాటు, క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బడ్డెన్న అభినందించారు. కళాశాలను సందర్శించి విద్యాబోధనలు పర్యవేక్షించిన అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన జావలెంగ్ త్రో, రన్నింగ్ క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించిన జూనియర్ కళాశాల విద్యార్థులు గోవర్ధన్, ఎం.టిక్లు నాయక్, యశ్వంత్‌లతోపాటు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంఈసీలో స్టేట్‌ఫస్ట్‌గా నిలిచిన పింజర్ల సంధ్యను బడ్డెన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు రేణుకాబాయి, బాలరాజు, పద్మావతి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడిగా లెనిన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులుగా న్యాయశాస్త్రం విద్యార్థి లెనిన్ ఎన్నికైనట్లు గురువారం ప్రకటించారు. నల్గొండ జిల్లాకు చెందిన లెనిన్ ఇంటర్ నుంచి ఏఐఎస్ఎఫ్‌లో పని చేస్తున్న ఆయన ఓయూలో ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు చదువుతున్నారు. విద్యార్థి సమస్యలపై, ఫీజుల పెంపు పట్ల అనేక ఆందోళన కార్యక్రమాలతో చురుకైన పాత్ర పోషిస్తున్న లెనిన్‌కు ఓయూ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన్నట్లు రాష్ట్ర నాయకులు సత్య తెలిపారు.